## ఉమ్మడి జిల్లా అర్చకులకు ఉగాది పురస్కారాలు

కమాన్‌చౌరస్తా, మార్చి 29 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు అర్చకులకు ఉగాది పురస్కారాలు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇందులో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ అర్చకుడు జగన్ మోహన్ ఉపాధ్యాయుల, కే వెంకటయ్య, జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అర్చకుడు టీ కపిందర్ స్వామి, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు పీ నరసింహా చార్యులు ఉన్నారు. అలాగే, దీపదూప నైవేద్య ఆలయాల అర్చకుల్లో కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ శివాలయం అర్చకుడు పీ శివప్రసాద్ ఉన్నారు. వీరు ఉగాది పర్వదినం రోజు హైదరాబాద్ రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పురస్కారాలు అందుకోనున్నారు.

# గ్రామాల మధ్య ఇసుక 'పంచాయితీ'

- రీచ్‌ల అనుమతుల్లో కొన్నిగ్రామాలకు అనుమతి
- మరికొన్నింటికి అభ్యంతరం
- అధికారుల అసంబద్ధ నిర్ణయాలతో ఇబ్బందులు
- రాగట్లపల్లి, ఆవునూర్‌లో ట్రాక్టర్ల అడ్డగింత
- తమ రీచ్‌లకూ అనుమతివ్వాలని డిమాండ్


రాగట్లపల్లిలో ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకుంటున్న నారాయణపూర్ ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు

**రాజన్న సిరిసిల్ల జిల్లాలో అధికారుల కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇసుక రీచ్‌ల అనుమతుల విషయంలోనూ అదే వైఖరి కొనసాగిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగాఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామం నిలుస్తున్నది. గతంలో ఈ గ్రామంతో పాటు వెంకటాపూర్‌లో ఇసుక రీచ్‌లు ఉండగా, తాజాగా ఒక్క వెంటకాపూర్‌కే అనుమతి ఇచ్చి నారాయణపూర్‌ను విస్మరించడంతో వివాదం నెలకొన్నది. కొన్ని గ్రామాలకు అనుమతి ఇస్తున్న అధికారులు, మరికొన్ని గ్రామాలకు అభ్యంతరం చెబుతుండడంతో గ్రామాల మధ్య 'పంచాయితీ' రోజురోజుకూ ముదురుతున్నది. అధికారుల అసంబద్ధ నిర్ణయాలపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతుండగా, పలు గ్రామాల్లో ట్రాక్టర్లను అడ్డుకుంటూ తమ రీచ్‌లకు అనుమతి ఇవ్వాలన్న డిమాండ్ వస్తున్నది.**

ఎల్లారెడ్డిపేట, మార్చి 29: గతంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్, నారాయణపూర్‌కు, ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్‌కు ఇసుక రీచ్‌లు ఉండేవి. ప్రభుత్వం మారిన తర్వాత మండలంలోని వెంకటాపూర్, ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్‌కు మాత్ర మే అధికారిక ఇసుక రీచ్‌లుగా ప్రకటించారు. అయితే, నారాయణపూర్‌కు అనుమతి ఇవ్వకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. అధికారులు కావాలనే తమ గ్రామంలో ఇసుక రీచ్‌కు అనుమతి ఇవ్వకుండా కక్షసాధింపు చర్యలకు దిగారని మండిపడుతున్నారు. దీం తో సహజంగానే నారాయణపూర్ సమీప గ్రామాల ప్రజలు ఇసుక తెచ్చుకోవాలంటే వెంకటాపూర్ నుంచి తెచ్చుకోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు. అయితే, ఇదే అదనుగా వెంకటాపూర్ వారు ఒక్కో ట్రిప్పుకు రూ.3 వేల నుంచి రూ. 3500 వరకు వసూలు చేస్తున్నారు. ఇది మధ్యతరగతి వర్గాలకు కొంత ఇబ్బందులను తెస్తున్నది. ఇటీవల నారాయణపూర్ గ్రామస్తుల ఒత్తిడి మేరకు నారాయణపూర్, రాగట్లపల్లి ట్రాక్టర్ అసోషియేషన్ వాళ్లు తమ రీచ్‌కు అనుమతివ్వాలని కోరినప్పటికీ అధికారులు వెంకటాపూర్ నుంచి తెచ్చుకోవాలని చెప్పారు. దీంతో ఇటీవల నారాయణపూర్ ట్రాక్టర్ అసోసియేషన్ వాళ్లు వెంకటాపూర్‌కు వెళ్తే వాళ్లు తమ రీచ్‌లోకి రావొద్దంటూ అభ్యంతరం చేయ గా, చేసేదేమీలేక వెనక్కి వెళ్లిపోయారు. ఇదే సమయంలో ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు అధికారికంగా రీచ్ ఉన్నప్పటికీ శనివారం ముస్తాబాద్ మండలం గూడెంలో సీసీరోడ్డు నిర్మాణానికి వెంకటాపూర్ నుంచి అక్కడి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో వెంకటాపూర్ ట్రాక్టర్లను సుమారు వంద మంది ఆవునూర్ ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు అడ్డుకున్నారు. తమ కు రూ.5 లక్షల వరకు ప్రభుత్వం నుంచి డబ్బులు రావాలని, సదరు బకాయిలు ఇచ్చే వరకు ఏ ట్రాక్టర్‌నూ రానివ్వబోమని చెప్పడంతో అధికారులు ట్రాక్టర్లను వెనక్కి పంపారు. అదే ఇసుకను ఎల్లారెడ్డిపేటలోని పలు గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు పంపేందుకు అధికారులు ప్రయత్నించడంతో నారాయణపూర్ ట్రాక్టర్ అసోషియేషన్ సభ్యులు వెంకటాపూర్ ట్రాక్టర్లను తమ పరిధిలోకి రానివ్వమని రాగట్లపల్లిలో అడ్డుకోవడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. చివరకు ఆయా ట్రాక్టర్లను ఆలయాల నిర్మాణానికి తరలించాల్సి వచ్చింది. రోజురోజుకూ ఇసుక పంచాయితీ గ్రామాల మధ్య చిచ్చు పెట్టే పరిస్థితి తెస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 'విశ్వావసు'కు స్వాగతం

నేడు ఉగాది



లేలేత చివుర్లద్దుకున్న తరువులు.. చిగురుటాకులు తొడిగిన కొమ్మలు.. విరిసిన పూబాలలు.. తొలిపూతలతో విరబూసే చెట్లు.. పిందెలతో నిండుగా మామిడి మానులు.. తెలుపుతో పులకించే వేప వృక్షాలు.. వనాలన్నింటినీ అరుణవర్ణంలోకి మార్చే మోదుగులు.. నెచ్చెలితో జతకట్టేందుకు కోయిలలు తీసే కుహు కుహూ రాగాలు.. హాయినిచ్చే వెచ్చని గాలులు.. ఇది వసంత రుతువు సోయగం! వసంతాగమన వేళ.. ప్రకృతి కాంత పచ్చదనం సింగారించుకుని హొయలుపోతున్నది! అందుకే ఆరు రుతువుల్లో ఇది ప్రత్యేకంగా నిలుస్తున్నది! ఈ రుతువు ఆగమనంతో తెలుగు కొత్త సంవత్సరం ఉగాది ఆరంభమమవుతుంది. క్రోధి నామ సంవత్సరం ముగిసి.. నేటి నుంచి విశ్వావసు నామ సంవత్సరం మొదలవుతున్నది.

– కరీంనగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్


మల్లాపూర్‌లో లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

## పథకాల అమలులో సర్కారు విఫలం

- ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి
- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

మల్లాపూర్, మార్చి 29: సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏడుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, 43 మందికి రూ.8,74,812 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని బాధ్యతగా నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ నాయకులకు హితవుపలికారు. కల్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని ఉచిత హామీలు ఇచ్చారని, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు కలిస్తే తులం బంగారం ఎప్పుడు ఇస్తారని అడగాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో పదేండ్లలో కరోనా వంటి ఎన్ని విపత్కర పరిస్థితులు వచ్చినా ఏనాడూ సంక్షేమ పథకాలు ఆగలేదని గుర్తుచేశారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు దేవ మల్లయ్య, ఏనుగు రాంరెడ్డి, ముద్దం శరత్, బండి లింగ స్వామి, మేకల సతీశ్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ అంబులెన్స్‌లు అనుమతించం

**'నమస్తే' కథనంపై స్పందించిన అధికారులు**

నమస్తే ఎఫెక్ట్

కరీంనగర్ విద్యానగర్, మార్చి 29 : కరీంనగర్‌లోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ప్రైవేట్ అంబులెన్స్‌ల దందాపై ఈ నెల 28న 'జీజీహెచ్ అడ్డాగా అంబులెన్స్‌ల దందా' శీర్షికన వచ్చిన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు స్పందించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు రెఫరల్ హాస్పిటల్‌గా ఉన్న కరీంనగర్ జీజీహెచ్‌లో గత కొంత కాలంగా ప్రైవేట్ అంబులెన్స్‌లు సాగిస్తున్న దందాపై 'నమస్తే తెలంగాణ' వివరంగా ప్రచురించింది. ఈ నేపథ్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ గుండా వీరారెడ్డి కలెక్టర్ పమేలా సత్పతికి వివరణ ఇచ్చారు. 108 అంబులెన్స్‌ల ద్వారా కరీంనగర్ జీజీహెచ్‌కు వచ్చే వారంతా ట్రామా, క్రిటికల్ కేసులే ఎక్కువగా వస్తాయని, ఇక్కడ వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎంకుగానీ, హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌గాని రెఫర్ చేస్తామని, అయితే కొంత మంది ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు పేషెంట్లు, వారి బంధువులను తప్పుదారి పట్టించి స్థానిక ప్రైవేట్ దవాఖానలకు తరలిస్తున్నారని స్పష్టం చేశారు. కొందరు ప్రైవేట్ అంబులెన్స్‌ల నిర్వాహకులు జీజీహెచ్‌లో ఇబ్బందులు సృష్టిస్తున్నారని, గతంలో పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని, ఇక నుంచి జీజీహెచ్ ఆవరణలోకి ఎలాంటి ప్రైవేట్ అంబులెన్స్‌లు రాకుండా సెక్యూరిటీ పెంచుతామని సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి కలెక్టర్ సహా డీఎంఈ అధికారులకు వివరించారు. ఈ విషయమై గట్టి చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## నీటి సమస్య రాకుండా చూసుకోవాలి

**హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**


సమావేశంలో పాల్గొన్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్ టౌన్, మార్చి 29 : నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలతో పాటు, 107 గ్రామాలకు ఎలాంటి నీటి సమస్య రాకుండా చూసుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక కేసీ క్యాంపులో గల ఎమ్మెల్యే కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమావేశమై మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రజలకు నీటి సమస్య ఉండకూడదని ఒకవైపు కాళేశ్వరం వంటి మహత్తరమైన ప్రాజెక్ట్ కట్టి, మరోవైపు మిషన్ కాకతీయతో రైతాంగానికి నీళ్లు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, అలాగే తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు మిషన్ భగీరథతో రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన నీళ్లు అందించిన మహనీయుడని కొనియాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏనాడూ ప్రజలకు నీటి సమస్య రాలేదని, ఇప్పుడు కూడా అలా రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నియోజకవర్గంలో ఏయే ప్రాంతాల్లో నీటి సమస్య ఎక్కువ ఉందో ఆ ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో మిషన్ భగీరథ డీఈలు బాలరాజు, శ్రీనివాస్‌తో పాటు ఏఈ పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ గందరగోళం

- పక్కపక్కన ప్లాట్లకు ఫీజుల్లో తేడాలు
- ఒకరికి రూ.వేలల్లో వస్తే.. మరొకరికి రూ.లక్షల్లో
- లబోదిబోమంటున్న దరఖాస్తులుదారులు
- టౌన్ కార్యాలయానికి పరుగులు
- మరో రెండ్రోజులే గడువు


టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో సర్వర్ డౌన్ కావడంతో నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 29: రాష్ట్ర సర్కారు చేపట్టిన లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ప్రక్రియ గందరగోళంగా మారింది. కరీంనగర్ నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం.. పట్టింపులేమితో దరఖాస్తుదారులకు నరకం కనిపిస్తున్నది. ఓవైపు ఫైళ్ల క్లియరెన్స్ ఎక్కడికక్కడ ఆగిపోగా, మరోవైపు పక్కపక్కన ప్లాట్లకు వేర్వేరుగా ఫీజులు రావడం, ఒకరికి రూ.వేలల్లో, మరొకరికి రూ.లక్షల్లో కట్టాలని చూపిస్తుండడంతో కంగుతింటున్నారు. ఇదేం లెక్క అంటూ తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఉదాహరణకు నగరంలోని సీతారాంపూర్ ప్రాంతంలోని ఓ ఏరియాలో పక్క పక్కన రెండు గుంటల విస్తీర్ణం చొప్పున ఉన్న ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా, వారిలో ఒకరికి రూ.46,564 ఫీజు రాగా, మరొకరికి రూ.లక్షకుపైగా రావడంతో బిత్తరపోయారు. అలాగే, బొమ్మకల్ ప్రాంతంలోని గుంటన్నర స్థలానికి డాక్యుమెంట్ విలువ ప్రకారం రూ.2 లక్షల మేర ఉండగా, ఫీజు రూ.1.50 లక్షలకు పైగానే వచ్చింది. అలాగే రాంపూర్ ప్రాంతంలోని రెండు గుంటల స్థలానికి డ్యాకుమెంట్ విలువ రూ.2 లక్షలకు పైగా ఉండగా, ఫీజు ఏకంగా రూ.5 లక్షలకు పైగా రావడం గమనార్హం. ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు వందలాది మందికి ఇదే సమస్య తలెత్తడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. డాక్యుమెంట్ వాల్యుయేషన్ ప్రకారమే ఫీజులు వస్తాయంటూ చెబుతున్నారు. అయితే ఫీజు రాయితీకి మరో రెండ్రోజుల టైం మాత్రమే ఉండడంతో ఏం చేయాలో తెలియక అర్జీదారులు అపసోపాలు పడుతున్నారు.

### వేధిస్తున్న సర్వర్ డౌన్ సమస్యలు

దరఖాస్తుల్లో లోపాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు టౌన్ ప్లానింగ్ కార్యాలయానికి రోజూ పెద్ద సంఖ్యలో వస్తున్నారు. నగరపాలక సంస్థకు వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో అత్యధికంగా షాట్ ఫాల్స్ (డ్యాకుమెంట్లు సరిగా లేవు) అన్న కారణంతోనే పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తుదారులు డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినా వాటిని టౌన్ ప్లానింగ్ అధికారులు సకాలంలో పరిష్కరించకపోవడంతో ఫీజు జనరేట్ కావడం లేదు. మరోవైపు ఆన్‌లైన్ సర్వర్ కూడా పదే పదే డౌన్ అవుతుండడంతో గంటల తరబడి కార్యాలయంలోనే వేచి ఉండాల్సినా పరిస్థితి ఉంది. మూడు రోజులు సర్వర్‌లో సాంకేతిక సమస్యలు వస్తూనే ఉన్నాయని అధికారవర్గాలే చెబుతున్నాయి. మరోవైపు నిషేధిత ప్రాంతాల పేరుతో చాలా డాక్యుమెంట్లకు అప్రూవల్ ఇవ్వడం లేదు. ఏదైనా సర్వే నంబర్‌లో నీటి వనరు ఉంటే ప్రొహిబిటెడ్‌లో చేర్చుతున్నారు. అయితే, ఆ సర్వేనంబర్‌కు అనుగుణంగా ఉన్న బై నంబర్లలోని నీటి వనరు గుర్తింపులు లేకున్నా ప్లాట్లు నిషేధిత జాబితాలో ఉన్నాయని పెండింగ్‌లో పెడుతూ, ఎన్‌వోసీ తేవాలని ఇబ్బందులు పెడుతున్నారని అర్జీదారులు ఆరోపిస్తున్నారు.

### సమస్యలు పరిష్కరిస్తాం

ఎల్ఆర్ఎస్ ఫీజుకు సంబంధించి వ్యత్యాసాలు ఉన్నవారు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం. మార్పులు చేస్తాం. గతంలో ఫీజులో మార్పులు చేసేందుకు అవకాశం ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆ చాన్స్ ఉంది. ఇవేకాదు దరఖాస్తుదారులకు ఎలాంటి సందేహాలు ఉన్నా తమ కార్యాలయంలో సంప్రదిస్తే నివృత్తి చేస్తాం. **- వేణు, ఇన్‌చార్జి ఏసీపీ, టౌన్ ప్లానింగ్**

## ఎమ్మెల్సీ కవితకు వెంకట్ క్షమాపణలు చెప్పాలి

తెలంగాణచౌక్, మార్చి 29: బీసీల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురించి మాట్లాడే నైతిక హక్కు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు లేదని కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ ధ్వజమెత్తారు. భేషరతుగా ఆమెకు క్షమాపణలు చెప్పకుంటే వెంకట్ పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. నగరంలోని ఐక్య వేదిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన పోరాటంతోనే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. బీసీల సమస్యలపై ఉద్యమిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నాయకత్వానికి రాష్ట్రంలోని బీసీల సంపూర్ణ మద్దతు ఉందని గుర్తు చేశారు.

















